క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పలువురు గ్రామస్తులు శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పదోతరగతి పరీక్షా కేంద్రాలల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి తెలిపారు. అయితే మొగిలిగిద్ద పాఠశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో పాఠశాలలో వార్షిక పరీక్షల నిర్వాహణకు ప్రభుత్వం అనుమలు ఇవ్వడం లేదు. దీంతో పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని కోరడంతో మార్కెట్ కమిటీ డైరక్టర్ పశమోని బుగ్గ కృష్ణ, ర్యాకల రమేశ్, ర్యాకల చిన్న బాలయ్య, కాగుల కిష్టయ్య రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నయ్యగౌడ్‌కు నివాళి

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆలోనిపల్లి చెన్నయ్య 9వ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, నాయకులు చెన్నయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... పదేళ్ల పాటు చటాన్‌పల్లి సర్పంచ్‌గా పని చేసిన చెన్నయ్యగౌడ్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. చెన్నయ్యగౌడ్ ఆశయాల సాధనే ధ్యేయంగా అతని భార్య జంగమ్మ సర్పంచ్‌గా పని చేశారని, ప్రస్తుతం కుమారుడు ఆలోనిపల్లి శ్రీనివాస్‌గౌడ్ కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారన్నారు.

గుర్రంపల్లి జాతర ఉత్సవాలు ప్రారంభం

కొందుర్గు: గుర్రంపల్లి జాతర ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లిలో జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గందలేపనం కార్యక్రమం నిర్వహించారు. శని, ఆదివారాలు జాతర ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు, కులమతాలకతీతంగా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. అధికారుల సమక్షంలో హుండీని సీల్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సక్రమ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, నాయకులు జబ్బార్, వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శోభ



విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శోభ

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేదలు ఆర్థికాభివృద్ధి చెందితేనే పేదరిక నిర్మూలన సాధ్యమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభా వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థినులకు సర్పంచ్ శోభావెంకట్‌రెడ్డి సొంత డబ్బుతో సైకిళ్లను పంపిణీ చేశారు. కేతిరెడ్డిపల్లి పంచాయతీకి అనుబంధ గ్రామమైన చాకలిగూడ నుంచి విద్యార్థులు రోజూ నడుచుకుంటూ వెళ్తుండడంతో పిల్లల తల్లిదండ్రులు గ్రామసభలో విద్యార్థుల ఇబ్బందులను వివరించారు. దీంతో స్పందించిన సర్పంచ్ సొంత డబ్బులతో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలు, పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్ధయ్య, దారెడ్డి వెంకట్‌రెడ్డి, హెచ్ఎం నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత సేవకు 'అభినందన'



గౌతంరెడ్డిని సన్మానిస్తున్న డీకే లక్ష్మీరెడ్డి

మొయినాబాద్: అంబులెన్స్‌తో ఉచిత సేవ చేస్తున్న యువకుడిని పోలీసులు అభినందించారు. మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన యాలాల గౌతంరెడ్డి అంబులెన్స్ సేవలు అందిస్తున్నాడు. అయితే మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా.. రోగులను ఆసుపత్రికి తరలించాలన్నా గౌతంరెడ్డికి ఫోన్ చేస్తే వెంటనే స్పందించి ఉచితంగా అంబులెన్స్ సేవలు అందిస్తున్నాడు. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి అతని సేవలను గుర్తించి శుక్రవారం శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఉచితంగా అంబులెన్స్ సేవలు అందిస్తున్న గౌతంరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శిరీష, ప్రణయ్‌తేజ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రైతుల అభివృద్ధికే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్: మాట్లాడుతున్న అంజయ్యయాదవ్

షాద్‌నగర్: రైతుల అభివృద్ధికే సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 15మంది రైతులకు రూ.70లక్షల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. రైతులు ఏకారణం చేత మరణించినా రైతు బీమా, పెట్టుబడి సాయం కోసం రైతు బంధు పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా, సబ్సిడీ కింద విత్తనాలు, ఎరువులు, యంత్ర సామగ్రి పంపిణీ వంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. రైతులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని అన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని పీర్ల మసీదు వద్ద నూతనంగా నిర్మిస్తున్న వరద కాలువ, షాదీఖానా నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం న్యూసిటీ కాలనీ ఓపెన్ డ్రైన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కవిత, సీఈఓ రఘునందన్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

షాద్‌నగర్‌టౌన్: బాధితులకు మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన శ్రీనివాస్‌కు రూ.80వేలు, యాదవ కాలనీకి చెందిన దండు స్వరూపకు రూ.40వేలు, రతన్ కాలనీకి చెందిన ఆంగోత్ శ్రీను రూ.60వేలు, గుండుగేరి కాలనీ చెందిన గుండు కృష్ణయ్యకు రూ.18,500, పండ్ల నర్సింలుకు రూ.30వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, నర్సింహ, జమ్మద్‌ఖాన్, శ్రీశైలం గౌడ్, రవియాదవ్, గౌస్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య చిత్రంలో జోగిని శ్యామల

చేవెళ్ల: మండల పరిధిలోని సింగప్పగూడలో రెండు రోజులుగా మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని మహిళలు బోనమెత్తి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డప్పుల చప్పులతో.. పోతురాజుల నృత్యాలతో బోనాల ఊరేగింపు కొనసాగింది. ఈ బోనాల ఉత్సవాలకు హాజరైన జోగిని శ్యామల నృత్యాలు బోనాల ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షనగా నిలిచాయి. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ ఎం.విజయలక్ష్మీరమణారెడ్డి, జెడ్పీటీసీ మాలతి, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నాయకులు పాల్గొన్నారు. సర్పంచ్ రహీమాబేగం గ్రామ నాయకులు అలీ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

మొయినాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్ బకాయిలను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ.5,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ప్రతీ విద్యార్థికి నెలకు రూ.3,500 చొప్పున స్కాలర్‌షిప్‌ను వారి అకౌంట్‌లో వేయాలని,, సంక్షేమ హాస్టలల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 300గురుకులాలకు నూతన భవనాలు నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలని.. పెంచిన ఇంజనీరింగ్ ఫీజులను తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకులు రాకేశ్, ప్రవీణ్, నాయకులు శివకుమార్, శ్రీకాంత్, అజయ్, మణికంఠ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: విధి నిర్వాహణలో ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాయికల్ గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా కంటి వెలుగు శిబిరాలను నిర్వహించాలని అన్నారు. నియోజకవర్గంలో కంటి పరీక్షల నిమిత్తం పది బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజు ఒక బృందం సభ్యులు మూడు వందల మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగి విజయవంతం చేయాలని అన్నారు. సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్వేత, బిందు, హెల్త్ సూపర్ వైజర్‌లు శ్రీనివాసులు, మెర్లిన్, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కేశంపేట: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని పోల్కోనిగుట్ట తండా, కేశంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కంటి వెలుగు నిర్వహిస్తున్న గ్రామాల్లో 18 ఏళ్లు పైబడిన ప్రతీ ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, వైద్యులు కార్తీక్, అనంనజీం, జిల్లా మాస్ మీడియా అధికారి పాలాది నరహరి, కృష్ణమోహన్, శ్రీనివాసులు, అంజనేయులు, ఉపేందర్‌రెడ్డి, పుష్ప, సుందరి, వీణ, సుజాత, సంతోష తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు



బీఎస్పీ నేతలతో మాట్లాడుతున్న చేవెళ్ల ఏసీపీ రవీందర్‌రెడ్డి

షాబాద్: అరెస్టు అప్రజాస్వామికమని చందనవెళ్లి భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హైతాబాద్‌లో 180 రోజులుగా రైతులు చేస్తున్న దీక్షలకు ప్రభుత్వం స్పందించకపోవడంతో రైతులు ఆమరణ దీక్ష చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో చేవెళ్ల ఏసీపీ రవీందర్‌రెడ్డి, షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ రైతులు దీక్ష చేపట్టకమందే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసు స్టేషన్‌లో దీక్ష కొనసాగించడంతో అఖిల పక్ష నాయకులు వచ్చి మాట్లాడి సమస్య వారం రోజుల్లో పరిష్కారం అయ్యేలా హామీ ఇవ్వడంతో ప్రస్తుతానికి దీక్ష విరమించారు. సీపీఐ జిల్లా కన్వీనర్ పాలమాకుల జంగయ్య, కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ... చందనవెళ్లి గ్రామంలో టీఎస్ఐఐసీ పరిశ్రమల కొరకు చేసిన భూసేకరణలో జరిగిన అవకతవకల పై, కుంభకోణంపై కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

కొందుర్గు: స్వయం ఉపాధి పథకంలో భాగంగా మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాయితీ రుణాలు అందించేదుకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు ఇంటర్వ్యూ నిర్వహించా రు. మొత్తం ఆరు యూనిట్లకుగాను 141 దరఖాస్తు చేసుకున్నారని, ఇంటర్వ్యూకు 71 మంది నిరుద్యోగు లు హాజరయ్యారని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్, ఎంపీఓ లాలయ్య పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

షాద్‌నగర్‌రూరల్: బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్ గుప్తా అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు దొడల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఎస్సీమోర్చా మండల అధ్యక్షుడు విఠ్యాలనర్సింలు అధ్యక్షతన 191వ బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు కృష్ణ, ఆంజనేయులు, మల్లేశ్ పాల్గొన్నారు.

బాల కార్మికులకు విముక్తి

కొత్తూరు: పట్టణంలోని ఆయా కూరగాయాల దుకాణాల్లో పని చేస్తున్న ముగ్గురు బాలకార్మికులకు శుక్రవారం పోలీసులు విముక్తి కల్పించారు. ఎస్‌ఐ శంకర్ వివరాల మేరకు స్థానిక పోలీసులతో పాటు ఆపరేషన్ ముస్కాన్ టీంతో కలిసి నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న పలు కూరగాయాల దుకాణాల్లో పనిచేస్తున్న ముగ్గురు బాలకార్మికులను గుర్తించి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. బాలకార్మికులను విధుల్లో పెట్టుకోవడం.. వారితో పనులు చేయించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఐక్యతతో ఉండి హక్కులు సాధించాలి

ముదిరాజ్ సంఘం తాలుకా అధ్యక్షుడు రాములు

కొత్తూరు: ముదిరాజులు ఐక్యతతో ఉండి హక్కుల సాధనకు పోరాడాలని ఆ సంఘం షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు అంచ రాములు అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా మండల కన్వీనర్‌గా మాసుల రామకృష్ణ, కోకన్వీనర్‌గా గొడుగు రవి, యువత విభాగం కన్వీనర్‌గా మన్నె దేవేందర్‌తో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి ముదిరాజులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీపల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్, నాయకులు మధు, శ్రీశైలం, యాదగిరి, బాల్‌రాజు, మాసుల అంజయ్య, ఆంజనేయులు, పలు గ్రామాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

కేజీబీవీ ప్రత్యేకాధికారి శారద

కొత్తూరు: బాలికలు ఆత్మరక్షణ కోసం విద్యార్థి దశ నుంచే కరాటే నేర్చుకోవాలని కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ ప్రత్యేకాధికారి శారద సూచించారు. హాస్టల్ ఆవరణలో ఆమె శుక్రవారం కరాటే శిక్షణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలని బీజేపీ నియోజకర్గ ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఠాగూర్ పాఠశాలలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా చదువుకోవాలని సూచించారు. పరీక్షలు అంటే భయాన్ని వీడాలని అన్నారు. ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, లక్ష్య సాధన కోసం శ్రమించాలని అన్నారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. చదువుతో పాటుగా వ్యక్తిగత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్, నాయకులు అందె బాబయ్య, వంశీకృష్ణ, వెంకటేశ్, పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌చారి, హన్మంత్, వివేక్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

ఎంపీపీ రవీందర్‌యాదవ్

నందిగామ: క్రీడలతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్‌తో కలిసి శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, సర్పంచ్ కుమార్, నాయకులు దేవేందర్ యాదవ్, వీరేందర్ గౌడ్, రాజు, సురేశ్, భాస్కర్, రవితేజ, శ్రీశైలం, మధు, రవి, మల్లేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో ఏపీఎల్ క్రికెట్ పోటీలు

మండల కేంద్రమైన నందిగామలో ఎస్ఎంసీ చైర్మన్ రాములు ఆధ్వర్యంలో ఏపీఎల్ క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. శుక్రవారం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేశంపేట జెడ్పీటీసీ సభ్యురాలు తాంత్ర విశాలరెడ్డి హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి షాద్‌నగర్ అధ్యక్షురాలు ఉమ, క్రీడాకారులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి తప్పక గుర్తింపు



కొందుర్గు: ఎంపీడీఓ ఆంజనేయులును సన్మానిస్తున్న నాయకులు



షాద్‌నగర్ రూరల్: ఆర్డీఓ రాజేశ్వరికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

శంకర్‌పల్లి: కష్టపడిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ అన్నారు. మండల ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన శంకర్‌పల్లి ఏపీఓ కె.నాగభూషణంను శుక్రవారం మండల పరిషత్ అధికారులు, కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి ప్రజల పక్షాన అంకిత భావంతో పని చేయాలని సూచించారు. నాగభూషణంకు మండల ఉత్తమ ఉద్యోగి అవార్డు వరించడం అభినందనీయం అన్నారు. ఈఓపీఆర్డీ గీత, సూపరింటెండెంట్ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఓకు ఉత్తమ సేవా అవార్డు

షాద్‌నగర్‌రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం వివిధ శాఖల అధికారుల సేవలను గుర్తిస్తూ ఉత్తమ సేవా అవార్డులను ప్రదానం చేసింది. షాద్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వరి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ అమయ్‌కుమార్ ఉత్తమ సేవా అవార్డు ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు శుక్రవారం ఆమె విలేకరులకు తెలిపారు.

ఉత్తమ ఎంపీడీఓకు సన్మానం

కొందుర్గు: జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న ఎంపీడీఓ ఆంజనేయులును శుక్రవారం ఘనంగా సన్మానించారు. విశ్వనాథ్‌పూర్ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, వెంకిర్యాల సర్పంచ్ లింగంగౌడ్, లాలాపేట సర్పంచ్ రాంరెడ్డి, తంగెళ్లపల్లి సర్పంచ్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఆయన్ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీఓ లాలయ్య, ఏపీఎం జయమాలిని పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: ఏపీఓ నాగభూషణంను సన్మానిస్తున్న ఎంపీడీఓ, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి



సీడీపీఓ నాగమణికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో అంగన్‌వాడీలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ నాగమణికి అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 70వేలమంది అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేస్తున్నారని అన్నారు. 40ఏళ్లుగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ ఎంతోమంది పేదలకు సేవలందిస్తున్న వారికి కనీస వేతనాలు లేక, ఉద్యోగ భద్రత లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, పాండిశ్చేరి రాష్ట్రాలలో అంగన్‌వాడీలను పర్మినెంట్ చేశారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలోనూ అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటుగా వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలలో అంగన్‌వాడీలకు ఇస్తున్న రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండుగ బోనస్‌ను అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలని అన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనునాయక్, సీఐటీయూ నాయకులు రాజశేఖర్, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు ఊర్మిళ, నాగజ్యోతి, పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

చేవెళ్ల: తమిళనాడు, పాండిశ్చేరిల మాదరిగా తెలంగాణలోనూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 70వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నా వీరిని ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలేవీ ప్రభుత్వం నేటికీ కల్పించటం లేదన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో హెల్త్‌కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. పశ్చిమబెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నాయని చెప్పారు. తెలంగాణలోనూ అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకకుంటే మార్చి 1,2,3 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా కోశాధికారి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఉమా, కల్పన, ప్రేమలత, స్వప్న, మంగమ్మ, రాధా, మల్లీశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మార్కెట్ కమిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.పాపారావు, వైస్ చెర్మన్ కురుమ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ పాలకవర్గం సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీలోని సమస్యలను కార్యదర్శి పద్మజను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి వసతి తదితర మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. చిన్న శంకర్‌పల్లి వద్ద మార్కెట్‌కు వచ్చే రోడ్డు బాగు చేయాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. బుధవారం శంకర్‌పల్లి మార్కెట్‌లో పశువుల సంత నిర్వహించనున్నందున రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా రసీదు లేనిదే పశువుల అమ్మకాలు, కొనుగోలు నిర్వహించకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, డైరెక్టర్లు నవీన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జోగు నర్సింలు, జాంగీర్, సాత సంతోశ్, విష్ణువర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.